

16న దేశవ్యాప్త సమ్మె

శ్రీకాకుళం అర్బన్ : బిఎస్ఎన్ఎల్ సంస్థ పరిరక్షణకు ఉద్యోగులు ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నట్టు ఉద్యోగ సంఘాల కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు మాతల గోవర్ధనరావు, పోలాకి వెంకటరావులు తెలిపారు. నగరంలోని సంస్థ సంచార భవన ఎదుట ఉద్యోగులు మంగళవారం గేట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులంతా సమిష్టిగా ఉద్యమించాలన్నారు. బిఎస్ఎన్ఎల్ పరిధిలో 4,5 జి సేవలను అందుబాటులోకి తెచ్చి సంస్థను కాపాడాలన్నారు. కేంద్రమంత్రి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు బకాయిపడిన 3వ వేతన సవరణ, బకాయిలు పెన్షన్ చెల్లింపు, 15 శాతం పిట్‌మెంట్ తక్షణమే అమలు చేయాలన్నారు. బడా కార్పొరేట్లకు సంస్థ ఆస్తులను కట్టబెట్టే ప్రయత్నం విరమించాలన్నారు. ఉద్యోగుల పదోన్నతి, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. అభిమన్యు, లక్ష్మి, గోపాలరావు, వి.శ్రీనివాసరావు, సురేష్, శ్రీనివాసరావు, శారద, ప్రసాదరావు పాల్గొన్నారు.

అంగన్వాడీల విజయోత్సవాలు


పలాస : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి, జిల్లా విలేకరుల యంత్రాంగం

ప్రభుత్వంతో చర్చలు సఫలం కావడంతతో అంగన్వాడీలు విజయోత్సవ ర్యాలీలు మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు కాశీబుగ్గ పాత బస్టాండ్ నుంచి శ్రీనివాస్ లాడ్జి కూడలి, అన్నపూర్ణ థియేటర్, ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు మాట్లాడుతూ గత 42 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు ఈ నెల 22న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టారని అన్నారు. ఈ సందర్భంలో అనేక రకాల నిర్బంధం ప్రయోగించిన ప్రభుత్వం చివరికి దిగొచ్చి యూనియన్ నాయకులతో చర్చించారని అన్నారు. ఈ చర్చల్లో అంగన్వాడీల డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. దీంతో అంగన్వాడీలు సమ్మె విరమించారని చెప్పారు. అంగన్వాడీల సమ్మె కార్మిక వర్గానికి స్ఫూర్తి దాయకమైదని పేర్కొన్నారు. ఈ సమ్మె ప్రభుత్వానికి ఒక గుణ పాఠాన్ని నేర్పిందన్నారు. ఎస్మా లాంటి నిర్బంధ చట్టాలనూ బెదరక నిలబడిన కార్మిక వర్గంగా అంగన్వాడీలు చరిత్ర సృష్టించారని తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు సిహెచ్.వేణుగోపాల్, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి పి.కుసుమ, ఎఐసిసిటియు నాయకులు డి.శ్రీనివాస్, యూనియన్ నాయకులు బి.సునీత, ఎం.మంజులకుమారి, ఎస్.శాంతి, కె.సరస్వతి, ఎల్.జయలక్ష్మి, పి.కళ్యాణి, బి.తులసి, ఎల్.దమయంతి, ఆర్.భవాని, ఆర్.అప్పలనరసమ్మ, బి.చామంతి, బొకర సునీత, డి.రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆమదాలవలసలో అంగన్వాడీల నిర్వహించిన విజయోత్సవ సభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు, పెన్షనర్ల సంఘం కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ, తపాలా శాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, అంగన్వాడి నాయకులు పంచాది లతాదేవి, మొదలవలస లత, మాధవి, పి.లక్ష్మి పాల్గొన్నారు. అనంతరం అందరికి స్వీట్లను పంపిణీ చేశారు.

బూర్జలో అంగన్వాడీలు నిర్వహించిన విజయోత్సవ సభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, కోన జ్యోతి, కొత్తకోట రాధ, అన్నపూర్ణ బండారమ్మ పాల్గొన్నారు.

కొత్తూరులో అంగన్వాడీలు నిర్వహించిన విజయోత్సవ సభలో సిఐటియు నాయకులు సిర్ల ప్రసాద్, నిమ్మక అప్పన్న, కార్యకర్తలు ఎస్.లక్ష్మి, హేమ, జలజాక్షి, బోడెమ్మ పాల్గొన్నారు.

గార ప్రాజెక్టు కార్యాలయం వద్ద విజయోత్సవ సభ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, సంఘ నాయకులు కె.కాంచన, కార్యకర్తలు కేక్ చేసి అందరికీ పంచిపెట్టారు.

టెక్కలి ప్రాజెక్టు పరిధిలో నిర్వహించిన విజయోత్సవ సభలో సిఐటియు నాయకులు నంభూరు షణ్ముఖరావు, పాలిని సాంబమూర్తి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రమణమ్మ, సుజాత, పద్మావతి, రమ, ఇందిర, అరుణ, ఉష పాల్గొన్నారు.


ఆమదాలవలస : మాట్లాడుతున్న నాగమణి


టెక్కలి రూరల్ : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు


కొత్తూరు : మాట్లాడుతున్న సిర్ల ప్రసాద్


గార: నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీల పోరాట విజయం

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న న్యాయ సమ్మతమైన కోర్కెల సాధన కోసం అవిశ్రాంతంగా 42 రోజుల పాటు వివిధ రూపాల్లో పోరాటాలు చేయడం వల్లే ప్రభుత్వం పరిష్కరించేందుకు ముందుకొచ్చిందని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావులు తెలిపారు. ఈ మేరకు పోరాటంలో విజయం సాధించిన అంగన్వాడీలకు మంగళవారం అభినందనలు తెలిపారు. సోమవారం అర్ధ రాత్రి వరకు గ్రూప్ ఆఫ్ మినిస్టర్లు ఉన్నతాధికారులు చర్చలు నిర్వహించిన సమస్యలపై సానుకూలంగా స్పందించి వాటిని పరిష్కరించేందుకు అంగీకారం తెలిపారని అన్నారు. ఈ సందర్భంగా చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం చేసిన మంత్రులకు, ప్రభుత్వ అధికారులకు, పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు ధన్యవాదాలు తెలిపారు. సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపిన కార్మిక సంఘాలకు, ప్రజా సంఘాలకు, మహిళా సంఘాలకు, సామాజిక సంఘాలకు, వివిధ రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు.


ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న షర్మిల

అరాచకాలు తప్ప అభివృద్ధి ఏదీ?

- బిజెపికి బానిసగా జగన్ ప్రభుత్వం
- దుష్ట పాలనకు అంతం పలకాలి
- కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి
- పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

రాష్ట్రంలో అరాచకాలు, అన్యాయాలు తప్ప అభివృద్ధి లేదని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఇచ్ఛాపురంలో ప్రజాప్రస్థానం విజయస్థూపం వద్ద నివాళ్లర్పించారు. అనంతరం స్థానిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ తదితర పథకాలు కీ.శే వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిర్వహించిన ప్రజా ప్రస్థానం పాదయాత్ర నుంచి పుట్టినవేనని తెలిపారు. వైఎస్ పోరాటానికి కొనసాగింపుగా పేదల పక్షాన నిలబడేందుకే ఆయన బిడ్డగా తాను వచ్చానన్నారు. రాష్ట్ర ప్రజల మేలు కోసం ఇచ్ఛాపురం నుంచి తన ప్రస్థానం ప్రారంభమైందని తెలిపారు. వైఎస్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానించిందని చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు. వైఎస్ జీవించినంత కాలం బిజెపిని వ్యతిరేకించారని గుర్తుచేశారు. ఇవాళ రాష్ట్రంలో పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉందన్నారు. బిజెపికి ఇక్కడి పార్టీలు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రాన్ని మోసం చేసిన బిజెపికి కీలుబొమ్మగా జగన్ ప్రభుత్వం మారిందని ధ్వజమెత్తారు. 25 మంది ఎంపీలను ఇస్తే ప్రత్యేక హోదా తెస్తానన్న జగన్మోహన్ రెడ్డి అధికారంలోకొచ్చాక ఒక్కరోజూ హోదా ఊసెత్తలేదని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే రాహుల్ గాంధీ తొలి సంతకం ప్రత్యేక హోదాపైనే పెడతానని చెప్పారని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో సాగుతున్న అరాచకాలు, అన్యాయాలతో ప్రజలు విసిగిపోయారని చెప్పారు. దుష్ట పాలనను అంతం చేయడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. వైఎస్ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పట్నుంచే సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్, సిడబ్ల్యుసి సభ్యులు గిడుగు రుద్రరాజు, నాయకులు కె.వి.పి రామచంద్రరావు, రఘువీరారెడ్డి, జెడి శీలం, డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, ఈశ్వరి, ఆలీంఖాన్, మాస పత్రిచక్రవర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలువురు వినతులు

షర్మిల తొలిసారిగా ఇచ్ఛాపురం వచ్చిన సందర్భంగా ఉపాధ్యాయుల సంఘాల నాయకులు సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ ప్లకార్డులను ప్రదర్శించి ఆమె కంట పడ్డారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. అలాగే బెంతు ఒరియా కులస్తులు తమకి జరుగుతున్న అన్యాయం గురించి వివరించారు. విశ్రాంత డిఎస్‌పి సమళ్ల ప్రసాదరావు రైతాంగం ఎదురుకుంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వంశధార జలాలు ఇచ్ఛాపురం వరకు పొడిగిస్తే... రైతాంగానికి మెలుచేకూరుతుందని వివరించారు. సహారా ఇండియా బాధితులు తమకి న్యాయం చేయాలని విన్నవించారు.

ఆర్‌టిసి బస్సులో ప్రయాణం

కంచిలి : పిసిసి అధ్యక్షులు షర్మిల కంచిలి మండల పరిధిలో రెండు కిలోమీటర్ల మేర ఆర్‌టిసి బస్సులో ప్రయాణించారు. శ్రీకాకుళం నుంచి కారులో ఇచ్ఛాపురం కార్యక్రమానికి వెళుతుండగా... అంపురం జాతీయ రహదారి వద్ద కారు ఆపి అటుగా వస్తున్న ఆర్‌టిసి బస్సులో ఎక్కి ఇచ్ఛాపురం వరకు ప్రయాణించారు. అమ్మఒడి, ఇళ్ల స్థలాలు వచ్చాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో పాటు పలువురు మహిళలు ఆమెతో సెల్ఫీలు దిగారు.

ఘన స్వాగతం

పలాస, టెక్కలి : పలాస మొగిలిపాడు జాతీయ రహదారి వద్ద షర్మిలకు కాంగ్రెస్ నాయకులు టి.మధు, వీర్రాజు, చంటి, బబ్బులు, టెక్కలి శ్యాంసుందరాపురం కూడలి వద్ద జిల్లా కిసాన్ సెల్ ఆధ్యక్షులు కోత మధుసూదనరావు, పూర్వ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొట్నూరు ఆనందరావు, చింతాడ దిలీప్, ఉమహంతి ధర్మారావు, కొటబొమ్మాళి, సంతబొమ్మాళి నాయకులు స్వాగతం పలికారు.


కంచిలి : షర్మిలతో సెల్ఫీ దిగుతున్న ప్రయాణికులు

ఇచ్ఛాపురం టిడిపికి కంచుకోట

ఎంపీ రామ్మోహన్ నాయుడు


బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

టిడిపి పార్టీ ఆవిర్భావం నుంచి ఒకే ఒకసారి మాత్రమే ఇచ్ఛాపురంలో టిడిపి ఓటమి చూసిందని, ఎప్పుడూ టిడిపికి ప్రజలు అండగా నిలిచి కంచుకోట చేశారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. అయోధ్య నుంచి ఇచ్ఛాపురం చేరుకొని గ్రామ దేవత స్వేచ్ఛా వతి అమ్మవారు ఆలయాన్ని సందర్శించారు. అక్కడ నుంచి కార్యకర్తలతో కలిసి ఈదుపురం రోడ్డు వరకు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీ నిధులతో నిర్మించిన ఎల్లమ్మ ఆలయం వద్ద కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభం చేశారు. బిసి సాధికారిత సమితి కన్వీనర్ కొండ శంకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. టిడిపిని ఓడించే దమ్ము ఎవ్వరికీ లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అరాచక పాలనా అంతానికి నడుం కట్టాలని పిలుపునిచ్చారు. పరదాల చాటు పర్యటించే ముఖ్యమంత్రి ఎక్కడా లేదని విమర్శించారు. ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అని చెప్పి ప్రజల జీవన విధానాన్ని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. అనంతరం వైసిపి నుంచి చేరిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆసి చిరంజీవిరెడ్డితో పాటు మరో వంద కుటుంబాలకు పార్టీ కండువ వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సాలీనా ఢిల్లీయాదవ్, దక్కత ఢిల్లీరావు, నందిక జాని, పి.తవిటయ్య, కాళ్ల జయదేవ్, కాళ్ల దిలీప్‌కుమార్, సీపాన వెంకటరమణ, సదానంద రోలో, ఆసీ లీలారాణి, మణిచంద్ర ప్రకాష్ పాల్గొన్నారు.


షర్మిలకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పాత పెన్షన్ సాధన సభకు ఆహ్వానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానం అమలు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెన్షన్ పథకం అమలు కోరుతూ ఈ నెల 28న రాజమండ్రిలో నిర్వహించనున్న యుటిఎఫ్ సభకు హాజరు కావాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ కోరారు. ఈ మేరకు జిల్లా పర్యటనకు వచ్చిన పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిలను నగరంలోని సన్‌రైజ్ హోటల్‌లో, కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడులను మంగళవారం కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ జీవన ప్రమాణాలు ఒకే విధంగా లేవని అన్నారు. ఉద్యోగుల్లో 50 శాతంగా ఉన్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సిపిఎస్‌కు ప్రత్యామ్నాయమని గ్యారెంటీడ్ పెన్షన్ పథకం సంతృప్తిని ఇవ్వలేదని అన్నారు. ఇందులో రూపొందించిన విధానం లోపభూయిష్టంగా ఉన్నాయన్నారు. 30 నుంచి 35 ఏళ్ల పాటు సుదీర్ఘకాలం పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగికి విశ్రాంత జీవన భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పక్కనపెట్టి సిపిఎస్ విధానం అమలు చేస్తున్నారని ప్రస్తావించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షులు కె.వైకుంఠరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శులు జి.నారాయణరావు, పి.సూర్యప్రకాశరావు, జి.సురేష్, వై.వాసుదేవరావు, జిల్లా నాయకులు పి.సింహాచలం, బి.ఆనందరావు, టి.సుధీర్, పి.రమణికుమారి తదితరులు పాల్గొన్నారు.

కళ్లు తెరిచి చూస్తే అభివృద్ధి కనిపిస్తుంది

షర్మిలకు ఎమ్మెల్యే కృష్ణదాస్ హితవు


ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో గడచిన నాలుగున్నరేళ్లలో వైసిపి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి జరగలేదని పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల మాట్లాడడం విడ్డూరంగా ఉందని వైసిపి జిల్లా అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ వ్యాఖ్యానించారు. నగరంలోని బాపూజీ కళామందిర్ ఆవరణలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూపించాలని ఇచ్ఛాపురం పర్యటనకు వచ్చిన వైసిపి పెద్దలు సజ్జల రామకృష్ణారెడ్డి, వై.వి.సుబ్బారెడ్డిలకు ఆమె సవాల్ విసరడం విడ్డూరంగా ఉందన్నారు. అభివృద్ధిని చూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ఇచ్ఛాపురం వెళ్లినప్పుడు పలాసలో సిఎం జగన్ ప్రారంభించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని చూడాల్సిందని సూచించారు. అలాగే ఉద్దాన ప్రాంతంలో రూ.700 కోట్లతో తాగునీటి అవసరాలు తీర్చామన్నారు. టెక్కలి నియోజకవర్గంలో మూలపేట వద్ద నిర్మిస్తున్న పోర్టు నిర్మాణ అభివృద్ధి కాదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు మాయ నుంచి బయటపడితే రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కళ్లకు కనిపిస్తుందని హితవుపలికారు. విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అన్ని రంగాల్లో సంక్షేమం అమలవుతోందని గుర్తు చేశారు. రాష్ట్రంలో 32 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, దీంతో పేదల సొంతింటి కల నెరవేరుతోందని అన్నారు. చెప్పుడు మాటలు విని షర్మిల విమర్శలు చేయడం తగదన్నారు. ఆయనతో ఆటు ఎమ్మెల్సీ నర్తు రామారావు, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎంపీ నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఉన్నారు.


మాట్లాడుతున్న కృష్ణదాస్

నాలుగో విడత ఆసరా విడుదల

- 4.54 లక్షల మందికి రూ.309 కోట్లు జమ
- జెసి ఎం.నవీన్


నమూనా చెక్కును అందజేస్తున్న కృష్ణదాస్, రెడ్డి శాంతి, నవీన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అందులో భాగంగా డ్వాక్రా సంఘాలకు నాలుగు విడతలుగా పెద్ద ఎత్తున వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా ఆర్థిక సహాయం అందజేసినట్టు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్ లో డిఆర్‌డిఎ, మెప్మా సంయుక్తంగా ఆసరా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ నర్తు రామారావులతో కలసి ఆయన నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం అమ్మఒడి, విద్యా దీవెన, వసతిదీవెన, ఆసరా, చేయూత, ఇళ్ల నిర్మాణం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. అందులో భాగంగానే జిల్లాలోని 4.54 లక్షల మంది డ్వాక్రా మహిళలకు రూ.309 కోట్లు నగదు జమ చేశామని చెప్పారు. కృష్ణదాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగు విడతల్లో నిధులను పంపిణీ చేశారని అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పథక సంచాలకులు డి.విద్యాసాగర్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకిరణ్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు ఎం.కృష్ణవేణి, కళింగ, పొందర, కూరాకుల, శ్రీశయన కళింగ కోమటి కార్పొరేషన్ల చైర్మన్లు, చైర్‌పర్సన్లు పర్సన్లు పేరాడ తిలక్, రాజపు హైమావతి, అప్పన్న, డి.పి.దేవ్, అంధవరపు సూరిబాబు, సుడా చైర్‌పర్సన్ కోరాడ ఆశాలత, చంద్రభూషన్ గుప్తా పాల్గొన్నారు.

అధ్వాన పాఠశాలపై జెసి ఆగ్రహం

మున్సిపల్ అధికారులపై గరం గరం


వివరాలు తెలుసుకుంటున్న జెసి నవీన్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని ఒకటో వార్డు పరిధిలోని జగ్గుశాస్త్రులపేట ఉన్న ప్రాథమిక పాఠశాల పరిసరాలు అధ్వానంగా ఉండటంపై జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ అప్పలనాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న సాధారణ ఎన్నికల పోలింగ్ స్టేషన్ల పరిశీలనలో భాగంగా మంగళవారం జగ్గుశాస్త్రులపేట ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలతో పాటు విద్యార్థినీ విద్యార్థులు ఉపయోగించే మరుగుదొడ్లను పరిశీలించారు. అపరిశుభ్రంగా తలుపులు లేని మరుగు దొడ్లను చూసి అవాక్కయ్యారు. పురపాలక సంఘ పరిధిలోని ప్రాథమిక పాఠశాల పరిస్థితి ఇంత దారుణంగా ఉండడానికి గల కారణం ఏమిటని మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్‌ను ప్రశ్నించారు. ఎటువంటి సమాధానం చెప్పకుండా బిక్క మొహం వేయడంతో కనీసం ఎన్నికల నాటికైనా పాఠశాల పరిసరాల్లో అవసరమైన మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, పాఠశాల నిర్మాణ లోపాలను సరిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హుదూద్ ఇళ్ల పంపిణీకి మోక్షమెప్పుడు?


సిద్ధంగా ఉన్న హుదూద్ ఇళ్లు

ప్రజాశక్తి- టెక్కలి

హుదూద్ ఇళ్ల పంపిణీకి పూర్తిస్థాయిలో మోక్షం లభించడం లేదు. మొదటి జాబితాలో 90 మందికి ఇళ్లు పంపిణీ చేసినా, రెండో జాబితాలో ఎంపిక చేసిన వంద మందికి నేటికీ పంపిణీ చేయలేదు. టిడిపి ప్రభుత్వ హయాంలో పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం వద్ద రూ.19 కోట్ల వ్యయంతో 190 ఇళ్లను నిర్మించారు. బన్నువాడ రోడ్డు విస్తరణ నేపథ్యంలో ఇళ్లు కోల్పోయిన వారికి, మత్స్యకారులు, నిరుపేదలకు ఇళ్లు పంపిణీ చేయాలని అప్పటి మంత్రి కింజరాపు ఆచ్చెన్నాయుడు భావించి రెవెన్యూ, పంచాయతీ, గృహనిర్మాణశాఖ అధికారులతో లబ్ధిదారుల జాబితాను తయారు చేయించారు. అప్పట్లో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇళ్ల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత

లబ్ధిదారుల ఎదురుచూపులు

అధికారం చేపట్టిన వైసిపి ప్రభుత్వం నాలుగేళ్ల పాటు ఆ ఇళ్ల పంపిణీ జోలికి పోలేదు. ఎట్టకేలకు టిడిపి ప్రభుత్వ హయాంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు కాకుండా కొత్త లబ్ధిదారుల జాబితాను రూపొందించి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, అప్పటి టెక్కలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దువ్వాడ వాణి 90 మందికి ఇళ్లను పంపిణీ చేశారు. మిగిలిన వంద ఇళ్లకు లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేస్తామని చెప్పారు. ఇరువురూ వేర్వేరుగా లబ్ధిదారుల జాబితాలు తయారు చేశారు. అనర్హులకు హుదూద్ ఇళ్లు పంపిణీ చేశారని, టిడిపి ప్రభుత్వ హయాంలో అధికారుల సమక్షంలో తయారు చేసిన జాబితాలో ఉన్న వారికి ఇవ్వలేదని ఎమ్మెల్యే కింజరాపు ఆచ్చెన్నాయుడు టెక్కలి సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మరోవైపు రెండో విడత ఇళ్ల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. దువ్వాడ దంపతుల మధ్య నెలకొన్న విభేదాల కారణంగా ఎవరి జాబితాకు ప్రాధాన్యత ఇవ్వాలో అధికారులకు అర్థం కాని పరిస్థితి నెలకొందని సమాచారం. ఇళ్ల పంపిణీ కోసం లబ్ధిదారులు ఎదురుచూపులు చూస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలైతే మళ్లీ పరిస్థితి మొదటికొస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్రమీనా

'ఉపాధి' పనులు పరిశీలన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం నీలంపేట గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలు చేస్తున్న పనులను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్రమీనా ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పని జరుగు విధానం, పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు, వంటి సదుపాయాలను, వేతనదారుల హాజరు పట్టిక తదితర అంశాలను పరిశీలించారు. వేతనదారులకు ఇచ్చిన కొలతలు ప్రాప్తికి పనులు చేపట్టే విధంగా కృషి చేయాలన్నారు. వేతనదారులకు వేతనాలు అందేవిధానం, గిట్టుబాటు వేతనం వంటి అంశాలను ఉపాధిహామీ ఎపిఒ అరుణకుమార్‌కు అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు ఉపాధిహామీ జెఒ జి.హరిప్రసాద్, టి.రాంబాబు, కె.కుమార్‌స్వామి, ఎస్.కసవయ్య పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

చంద్రబాబుతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పేదవాడు హాయిగా బతకాలంటే చంద్రబాబునాయుడు సిఎం కావాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలం కురుడు పంచాయతీ యరకన్నపేట, బావాజీపేట, రామయ్యపేట, మెండపేట, పొన్నానపేట గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యాటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని,, వచ్చిన వెంటనే ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల అభివృద్ధి చేస్తామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు టిడిపికి ఓటు వేసి వైసిపిని చిత్తుగా ఓడించాలని ఆయన ప్రజలకు కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, పిఎసిఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి నాయకులు వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అనారోగ్యంతో మరణించిన బాధిత కుటుంబానికి నగదు చెక్కును జిల్లా ఎస్‌పి జి.ఆర్ రాధిక అందజేసారు. జిల్లాలో ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ, అనారోగ్యంతో మరణించిన ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కేశవరావు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరు కాబడిన విడో ఫండ్, ఫ్లాగ్ ఫండ్‌లు కలిపి రూ.75 వేల చెక్కులను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్ సతీమణి కృష్ణవేణికి అందించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి రావాల్సిన ప్రయోజనాలను సకాలంలో అందేటట్లు చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో పోలీస్ కార్యాలయం ఎఒ సిహెచ్ గోపీనాథ్ ఉన్నారు.

ఓపెన్ పరీక్షలకు ఫీజు గడువు పెంపు

ప్రజాశక్తి- టెక్కలి

ఈ ఏడాది మే నెలలో జరగనున్న ఓపెన్ యూనివర్సిటీలో చేరి పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఫీజు చెల్లించేందుకు అవకాశం లభించిందని కన్వీనర్ రోణంకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. తత్కాల్ ఫీజు రూపంలో రూ.వెయ్యి అపరాధ రుసుంతో విద్యార్థులు చేరవచ్చునని తెలిపారు. ఈ మేరకు సంబంధిత శాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. నూతనంగా చేరే అభ్యర్థులు ఆధార్ కార్డు, సర్టిఫికేట్‌లు, కులధ్రువీకరణ పత్రం, పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నేరుగా వచ్చి ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు. ఈ నెల 22 నుంచి 30 వరకు సమయం ఉందన్నారు.



చిత్రాలను గీస్తున్న విద్యార్థులు

కేంద్రీయ విద్యాలయంలో చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగర శివారుల్లోని కేంద్రీయ విద్యాలయలో మంగళవారం పరాక్రమ దివాస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. జిల్లాలోని 16 స్కూళ్లలో చదువుతున్న వంద మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రధాని మోడీ రాసిన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకం లోని పలు అంశాలపైన, చంద్రయాన్, వికసిత భారత్ తదితర థీమ్స్/టాపిక్స్‌పైన ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ చిత్రాల నుంచి ఐదుగురిని ఎంపిక చేసి ప్రిన్సిపాల్ సుఏబ్ ఆలం బహుమతులను అందజేశారు. పెయింటింగ్ ఎక్సిబిషన్‌లో విద్యార్థులు వేసిన చిత్రాలను ప్రదర్శించారు. ఈ పోటీలను అధ్యాపకులు పర్యవేక్షించారు.



భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాలి మండలం తాళ్లవలసలో సర్పంచ్ గున్న జానకి ప్రభాకర్ ఆధ్వర్యంలో గ్రామకంఠం పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి గృహహక్కు పత్రాలను అధికారులు మంగళవారం పంపిణీ చేశారు. ప్రతి పేదవానికి తమ ఇంటిపై శాశ్వత భూహక్కు కలుగుతుందని, వివాదాలు పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఎంపిపి మేరుగు రాజేశ్వరి అప్పారావు, ఎంపిడిఒ ఉమాసుందరి, ఇఒపిఆర్‌డి గోపాలరావు, ఎంపిటిసి వాడరేవు జగది, వార్డు సభ్యులు, చిన్నతుంగాం కార్యదర్శి డి.శ్రీనివాసరావు, విజయ్ కుమార్ వర్మ పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి



కవిటి : ర్యాలీ నిర్వహిస్తున్న బివికె విద్యార్థులు



నౌపడ : నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులు

ప్రజాశక్తి- కవిటి

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్‌విజె విద్యా సంస్థలు, కల్యాణి ఆంగ్ల పాఠశాల, కవిటి కొత్తూరులో బివికె పాఠశాలల్లో నేతాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బివికె పాఠశాల విద్యార్థులు నేతాజీ జయంతిని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.మల్లేశ్వరరావు, ఎస్‌విజె డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పి. సత్యనారాయణ, ఎం.భాస్కరరావు, భీమారావు, ఎఒ జోష్ కుమార్, కల్యాణి ఆంగ్ల పాఠశాల ప్రిన్సిపాల్ బిందు మాధవి, బివికె కరస్పాండెంట్ పూడి రామారావు, ప్రిన్సిపాల్ అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగాం: నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి సందర్భంగా పెద్ద తామరపల్లిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం గున్నయ్య, ఉపాధ్యాయులు బాలక శంకరరావు, కుమారి తదితరులు సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్లర్పించారు.

నౌపడ: సంతబొమ్మాలి మండలం దండు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కోత చైతన్య సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళ్లర్పించారు. ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

టెక్కలి: స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకను జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గవరయ్య, కుమారస్వామి, రమణ, మౌళీ, విశ్వనాథం, సంజీవ్, రామారావు పాల్గొన్నారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఆధ్వర్యంలో సుభాష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, రామారావు, కో-ఆర్డినేటర్ లూక్‌పాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు: లావేరు శాఖ గ్రంథాలయంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమములో గ్రంథాలయ సహాయకులు గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎల్ఐసి ఉద్యోగి టేకి ఆచారి ముందుగా నేతాజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కె.ప్రకాష్, బి.జగదీష్, డి.శంకరరావు, వై.నందీశ్వరరావు, టి.కృష్ణప్రసాద్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక మహర్షి ఉన్నత విద్యాలయంలో నేతాజీ జయంతి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.రాంబాబు, ఉపాధ్యాయులు రామారావు, రామనుజం, ఎల్.కిరణ్ కుమార్, ఎల్.కన్నబాబు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : దేశంపై అంకిత భావం, సంకల్ప శక్తి ఉన్న పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నేతాజీ 127వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని గాంధీ స్మృతివనంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ తెల్లదొరల పాలన అంతం కావడానికి ఒక్క అహింసా మార్గం సరిపోదని భావించి సాయుధ పోరాట బాట పట్టిన గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడని అన్నారు. కార్యక్రమంలో గాంధీ మందిర నిర్వహకులు సురంగి మోహనరావు, నిక్కు అప్పన్న, జామి భీమశంకర్, నటుకుల మోహన్, పొన్నాడ రవి, కొంక్యాన వేణుగోపాలరావు, మెట్ట అనంతం బట్లు, పందిరి అప్పారావు, తర్లాడ అప్పలనాయుడు, డి పార్థసారథి పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న గ్రంథాలయ సిబ్బంది



నందిగాం : నేతాజీ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



టెక్కలి : నివాళ్లర్పిస్తున్న కిరణ్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నేతాజీ చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, పి.భానుమతి, పి.రామమోహన్, టి.రాంబాబు, గణేష్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

నగరంలోని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో నేతాజీ చిత్రపటానికి డైరెక్టర్ బి.చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ డి.విక్రమ్, ఎన్ఎస్ఎస్ పిఒ ఎం.నాగభూషణరావు, లైబ్రేరియన్ పి.కృష్ణారావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

జగన్ పాలనలో బిసిలకు అన్యాయం



బూర్జ : మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- బూర్జ

జగన్ పాలనలో బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందని టిడిపి పార్లమెంటరీ అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మంగళవారం బూర్జలో నిర్వహించిన బిసి సభలో పాల్గొన్నారు. రాష్ట్రంలో 12శాతం ఉన్న రెడ్డిలను అందలం ఎక్కించి, 78 శాతం ఉన్న బిసిలను అణగదొక్కుతున్నారని విమర్శించారు. సామాజిక బస్సుయాత్రలో బిసిలకు పెద్దపీట వేస్తామని చెప్పిన జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత బిసిలకు మొండిచేయి చూపించారన్నారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, ఇతర పదవుల్లో కూడా రెడ్డిలకు అధిక స్థానాలను కల్పించి బిసిలకు నామమాత్రపు సంఖ్యకు పరిమితం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం స్పీకర్‌గా ఉన్న తమ్మినేని సీతారాంకు రాజకీయ బిక్ష పెట్టింది టిడిపి అని గుర్తు చేసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో బిసిలంతా ఏకమై వైసిపికి చమరగీతం పాడాలన్నారు. అంతకు ముందు ఢఇంకలపర్త గ్రామ ఉపసర్పంచ్ నారాయణరావుతో పాటు మరో 50 మంది రవికుమార్ సమక్షంలో టిడిపిలో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వి.సీతారాం బాబు నాయుడు, సమన్వయకర్త వజ్జా బాబురావు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మాజీ జెడ్‌పిటిసి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అనెపు రామకృష్ణ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: రెడ్డి రాజ్యంలో బిసిలకు చోటులేదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మంగళవారం బాతుపురంలో నిర్వహించిన జయహో బిసి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ అసమర్ధపాలనలో రాష్ట్రంలో బిసిలు ఎక్కువగా నష్టపోయారన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఆదరణ పథకం ద్వారా బిసిలకు పెద్దఎత్తున లబ్ధి చేకూరిందన్నారు. వైసిపి ప్రభుత్వం రూ.75 వేల కోట్ల బిసి సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి బిసిలకు అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పలరాజు హయాంలో ఆరు కొండలు కనుమరుగయ్యాయన్నారు. నియోజకవర్గంలో గౌతు శివాజీ హయాంలో తప్ప మంత్రి అప్పలరాజు హయాంలో అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, అరసవల్లి ఉమామహేశ్వరరావు, పిరికట్ల విఠల్, కర్ని రమణ, పుచ్చ ఈశ్వరరావు, కణితి సురేష్, పోతనపల్లి సాంబమూర్తి, బుల్లోజు శశిభూషణ, దువ్వాడ హేమబాబు చౌదరి, జయరాం చౌదరి, చిట్టిబాబు, గొరకల వసంతరావు పాల్గొన్నారు.



పొందూరు : సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న స్పీకర్ సీతారాం

అభివృద్ధి, సంక్షేమమే వైసిపి లక్ష్యం

పొందూరు: అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా సిఎం జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. మండలం తాడివలసలో మంగళవారం స్పీకర్ తమ్మినేని సీతారాం ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలన్నదే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు, స్థానిక నాయకులు తమ్మినేని వాసు పాల్గొన్నారు.

బూర్జ: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగు అన్నారు. కొల్లివలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి ఏదో ఒక సంక్షేమ పథకం వైసిపి ప్రభుత్వం అందజేస్తుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అందజేయని పథకాలు ఈ ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు అందజేస్తుందన్నారు. అలాగే ఇంటింటికి జలజీవన్ మిషన్ పథకం ద్వారా రోడ్డుకు ఇరువైపుల సిసి రోడ్లను ప్రొక్లెయిన్‌తో గోతులు తీశారని, దానిద్వారా రాత్రి సమయంలో బయటకు వస్తే సిసి రోడ్లు ముక్కలు రోడ్లపైనే ఉండడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని, తక్షణమే రోడ్లు బాగు చేసి ఇబ్బందులు లేకుండా చేయాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర టిట్కో డైరెక్టర్ గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి రామారావు, సర్పంచ్ గడే వేణు, ఎంపిడిఒ రవీంద్రబాబు, తహశీల్దార్ రమణారావు, ఎపిఒ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వానికి నూకలు చెల్లాయి

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూకబ్జాలు, ఆక్రమణలు, అరాచకాలతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మరో 80 రోజుల్లో వైసిపి ప్రభుత్వానికి ఇంటికి పంపించాల్సిన సమయం ఆసన్నమైందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మండలంలో సరియాపల్లిలో 22 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలన చూసి విసుగు చెంది వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు టిడిపిలో వచ్చి చేరుతున్నారన్నారు. పలాస నియోజకవర్గంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అధికారాన్ని అడ్డుపెట్టుకుని దోచుకుంటున్నారని ఆరోపించారు. రూ.700 కోట్లు మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని సిఎం జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం చేశారే తప్ప పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేయలేకపోయారని విమర్శించారు. ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో నేటికీ పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది నియమించలేక పోయారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపు తథ్యమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పి.విఠల్‌రావు, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్, దువ్వాడ సంతోష్ కుమార్, బూరెల కృష్ణంరాజు, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి, నాగరాజు, కొర్ల విష్ణు చౌదరి, దువ్వాడ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో శిరీష


'ఐతమ్' విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఇండియా స్పార్క్, ఆలీబాబా క్లౌడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఐతమ్ సిఎస్ఇ, ఐటి, సిఎస్ఎం, సిఎసికి చెందిన 200 మంది విద్యార్థులకు 2023- 2024 విద్యాసంవత్సరానికి సోమ, మంగళవారల్లో ఆన్‌లైన్ ద్వారా డెవలపర్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. రెండురోజుల శిక్షణలో భాగంగా ఆలీబాబా క్లౌడ్ సర్వీసెస్ - డెవలప్ మెంట్ టూల్స్‌లో శిక్షణ పొందిన అనంతరం విద్యార్థులకు సర్టిఫికేట్లను అందజేస్తారన్నారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు ఆధునిక పరిజ్ఞానాన్ని, పరిశ్రమలకు కావాల్సిన నూతన విజ్ఞానాన్ని వృద్ధిచేసుకొంటారన్నారు. ఈ సందర్భంగా ఇండియా స్పార్క్ ఫౌండర్ సిఇఒ రూపా తంతి శిక్షణపై వివరిస్తూ ఆదిత్య కళాశాలతో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు క్లౌడ్ సర్వీసెస్‌పై నూతన అప్లికేషన్లు అభివృద్ధి చేయడానికి కావాల్సిన పరిజ్ఞానాన్ని అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.యుగంధర్, హెచ్‌డిలు డాక్టర్ యు.డి.ప్రసన్న, డాక్టర్ వై.రమేష్, డాక్టర్ ఎం.వి.బి.చంద్రశేఖరరావు, విభాగాల కో-ఆర్డినేటర్లు అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.చలపతిరావు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న రూపా తంతి



ఒఎంఆర్ షీటు విధానాన్ని పరిశీలిస్తున్న పగడాలమ్మ

పరీక్షలు పరిశీలన

ప్రజాశక్తి- టెక్కలి

సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎఫ్ఎ-3 పరీక్షలను టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిణి గార పగడాలమ్మ పర్యవేక్షించారు. మండలంలో సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షలను మంగళవారం పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఎక్కడా ఎటువంటి లోపాలు లేకుండా పరీక్షలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈమెతో పాటు హెచ్‌ఎం వేణికుమారి, డి.నాగభూషణం, రోణంకి గౌరీపతి, నంబాళ్ల వాసుదేవరావు, నగేష్ పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలం గొప్పిలి నుంచి టెక్కలి పట్నంలో అభివృద్ధి పనులకు అలాగే మెళియాపుట్టి నుంచి మహేంద్ర తనయ రోడ్డులోని రోడ్డు పనులకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి శంకుస్థాపన చేశారు. రూ.2 కోట్ల 31 లక్షలతో ఈ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రకుమారి, తహశీల్దార్ సరోజిని, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, మండల వైసిపి కన్వీనర్ పల్లి యోగి పాల్గొన్నారు.



వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలం బన్నువాడ గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం చెట్టుకు ఉరివేసుకుని టెక్కలి చిన్నచేరివీధికి చెందిన మామిడి అప్పలనాయుడు(42) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బన్నువాడ గ్రామం సమీపంలో ఒక చెట్టుకు మృతదేహం వేలాడి ఉండడంతో సమీప గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతినికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి...

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మండలంలోని సుంకర జగన్నాథపురానికి చెందిన టెంక ఆదినారాయణ (38) కుటుంబ కలహాలతో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పద్మావతి, అత్త కోళ్ల కామమ్మ, బావమరిది కోళ్ల కుమార్ వేధింపులు తాళలేక తన జీడి తోటలో జీడి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. ఆదినారాయణకు వివాహమైన తర్వాత నుంచే పద్మావతితో గొడవలు జరుగుతున్నాయి. మృతుడు గత కొంతకాలంగా వేరుగా ఉంటున్నాడు. ఇటీవల తగాదాలు తారస్థాయికి చేరడంతో ఆత్మహత్యకు పాల్గొన్నట్లు తెలుస్తోంది. మృతుడికి కుమారుడు ప్రేమచంద్ర, కుమార్తె హేమలత ఉన్నారు. దీంతో తల్లి రేయ్యమ్మ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోధిస్తున్నారు. తల్లి రెయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో వంజంగి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న తాండ్ర గున్నయ్య, మరో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. పేకాట ఆడుతుండగా పోలీసులు వారిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.1,040 నగదును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.



రహదారి పక్కన బోల్తా పడిన ట్రాక్టర్

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- పొందూరు

మండలం లోలుగు గ్రామ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ధాన్యం బస్తాలతో ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటనలో తృటిలో ప్రమాదం తప్పింది. పాలఖండ్యాం నుంచి నరసన్నపేట మిల్లుకు ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌తో తరలిస్తుండగా లోలుగు గ్రామ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలోకి బోల్తా పడింది. ఆ సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ నారాయణరావు పక్కకు దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదంతో ధాన్యం బస్తాలు చెల్లాచెదురుగా పడిపోవడంతో రైతుకు స్వల్పంగా నష్టం వాటిల్లింది.

శరత్చంద్రుడు మృతి

ప్రజాశక్తి- సోంపేట



శరత్చంద్రుడు (ఫైల్)

దేశ ఉద్యమ చరిత్రలోనే పేరుగాంచిన సోంపేట థర్మల్ పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, పర్యావరణ పరిరక్షణ సమితిలో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేసిన మడే శరత్చంద్రుడు సోమవారం రాత్రి మృతి చెందారు. బారువ మేజర్ పంచాయతీకి చెందిన ఆయన రెండుసార్లు సర్పంచ్‌గా పదవి బాధ్యతలు నిర్వహించారు. ఆయన భార్య హేమావతి ఒకసారి సర్పంచ్‌గా పనిచేశారు. అలాగే సోంపేట బేల ప్రాంతంలో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న ఉద్యమానికి నాయకత్వం వహించి పర్యావరణ పరిరక్షణ సమితిలో కీలక సభ్యుడిగా ఆయన ఎంతో కృషి చేశారు. ప్రజల కోసం పోరాటం చేసి కేసులు ఎదుర్కొని జైలుకు సైతం వెళ్లారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల గ్రామస్తులతో పాటు పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ వై.కృష్ణమూర్తి, మత్స్యకార ఐక్యవేదిక సభ్యులతో పాటు పరిసర ప్రాంత ప్రజలు, ప్రజాప్రతినిధులు తమ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం బారువలో ఆయన దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, ఎంపిపి డాక్టర్ ఎన్.దాసుతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, వైద్యులు ఎ.వి.రామకృష్ణ నాయకులు ఎర్ర రజిని, బి.వెంకటరావు, సత్యం, వరప్రసాద్, దుంపల కృష్ణారావు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మత్స్యకార గ్రామాల్లో పర్యటన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలో మత్స్యకార గ్రామాలైన ఇసుకల పాలెం, రుషికుద్దలలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే పిరియ సాయిరాజ్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు, పెద్దలతో కలిసి మాట్లాడారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాలపై ఆరా తీశారు. రానున్న ఎన్నికల్లో మరల జగన్మోహన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి దాసు, నాయకులు శిలగాన భాస్కరరావు, మడ్డు రాజారావు, ఎన్.బెనర్జీ, రామారావు, కామేష్, బి.తిరుపతిరావు, రమేష్, సోనియా, గౌరీ, కామేశ్వరరావు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సాయిరాజ్

రాష్ట్రాభివృద్ధి టిడిపికే సాధ్యం

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రాభివృద్ధి చెందాలంటే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అవుతుందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్‌రావు అన్నారు. మండలంలోని రెంటికోట, లొత్తురు, కంట్రగడ గ్రామాల్లో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అందరం కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణరావు, దువ్వాడ సంతోష్ నాయుడు, తమ్మినేని గంగారాం, దువ్వాడ హర్ష, ఒరియా మోహనరావు, కద్దల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టెక్కలి: మండలంలో లింగాలవలసలో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, పార్టీ నాయకులు బగాది సునీల్‌కుమార్, అన్నెపు వాసు, నంబాళ్ల గోవిందరావు, సంపతిరావు భాస్కరరావు, జన్ని సంజీవిరావు, బెల్లాన నారాయణరావు, సింహచలం పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి అట్లా సరోజినమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. ఈ సమావేశానికి 21 మంది సభ్యులు హాజరు కావాల్సి ఉండగా 9 మంది సభ్యులే హాజరయ్యారు. అధికారులు కూడా పూరిస్థాయిలో హాజరు కాకపోవడంతో సాదాసీధాగా సమావేశం ముగించారు. ఈ సమావేశంలో ఎంపిటిసిలు సత్తారు ఉషారాణి, కూన పార్వతి, బెండి దేవాని, పొందర దేవి, ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి, ఎంఇఒ దుక్క తులసీరావు, ఎపిఒ బగాది ప్రసాదరావు, ఎపిఎం గురబెల్లి నారాయణరావు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న తెలగ కులస్తులు

'తెలగ'లను బిసిల్లో చేర్చాలి

ప్రజాశక్తి- కవిటి

అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న తెలగ సామాజిక తరగతులను బిసిల్లో చేర్చాలని నియోజకవర్గ తెలగ కుల కన్వీనర్ ఇంగుడు లక్ష్మీనారాయణ, స్టేట్ కాపునాడు వైస్ ప్రెసిడెంట్ పొకల వెంకటరావు కోరారు. మండలంలో తెలగ కులస్తులతో కలిసి ఇన్‌ఛార్జి తహశీల్దార్ రామచంద్రరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 1962 వరకు తమకు రిజర్వేషన్ ఉండేదని, ఆ తరువాత తొలగించారని తెలిపారు. ఇదే తమ వెనుకబాటుతనానికి కారణమని, గతంలో పుట్టుస్వామి, మంజునాథన్ కమిషన్లు తెలగ కులస్తుల వెనుకబాటుతనాన్ని గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్టు గుర్తుచేశారు. తమ వెనుకబాటుతనాన్ని గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలగ కులస్తులను బిసిల్లో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ దుర్గారావు, డి.దుర్యోధన, కె.శ్రీనివాసరావు, ముత్యాల కృష్ణారావు, రమణమూర్తి, మిన్నారావు, బండారు శ్రీను పాల్గొన్నారు.

ఆశావర్కర్లను నియమించాలి

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రంలో గరికిపాలేం కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ ప్రాంతాల్లో నాలుగేళ్లుగా ఖాళీగా ఉన్న ఆశావర్కర్ల పోస్టులు ప్రభుత్వం తక్షణమే నియమించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసుకొని, ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సమాచారమందించే ఆరోగ్యవారధులు ఆశ కార్యకర్తలని గర్భిణులకు, బాలింతలకు మందులు అందించడం, ప్రభుత్వ వైద్యశాలల్లో డెలివరీలు అయ్యేలా చూడడం, పిల్లలకు టీకాలు వేయించడం, తద్వారా మాతా శిశు మరణాలు తగ్గించడం, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ దగ్గు, జ్వరం, జలుబు తదితర చిన్నపాటి వ్యాధులకు మందులు అందజేస్తూ ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ రోగాల కట్టడికి చర్యలు చేపడుతుండేవారని, గత నాలుగేళ్లుగా ఆశవర్కర్లు లేక వైద్యసేవలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖ అధికారులు స్పందించి తక్షణమే ఈ రెండు కాలనీలకు ఆశవర్కర్లను నియమించి ప్రభుత్వ వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు.

కల్లుగీత కార్మికులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రకృతి పానీయమైన ఈత, తాటి కల్లులో ఉన్న పోషకాలపై ప్రభుత్వం ప్రచారం చేయాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుబ్బ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో శ్రీశయన సంఘం భవనంలో గీత కార్మికుల జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. ప్రాచీన కాలం నుంచి సాంప్రదాయకమైన కల్లుగీత వృత్తిని కల్లులో ఉన్న పోషకాలపై ప్రభుత్వం అధ్యయనం చేసి ప్రచారం చేయాలన్నారు. కల్లుగీత కార్మిక కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న కళ్లగీత వృత్తిని ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు. కల్లుగీత వృత్తిని ఆధునీకరించి అభివృద్ధి చేసి తాటి పరిశ్రమలు నెలకొల్పి గీత కార్మికుల కుటుంబాలకు జీవనోపాధి కల్పించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు కోట అప్పారావు, సహాయ కార్యదర్శి బంటుపల్లి సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు గొండు రాజారావు, బెవర వీరస్వామి, లొట్టి అప్పన్న పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం


వజ్రపుకొత్తూరు : రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో ప్రియా అగ్రహారం గ్రామ సచివాలయ ఆవరణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుప్పెడుపేట పిహెచ్‌సి వైద్యాధికారి రత్నరాజు రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు నేరుగా వారివారి గ్రామాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయటం, మందులు అందించడం ఎంతో తృప్తిని కలిగించిందన్నారు. వీటితో పాటు నేత్ర పరీక్షలు కూడా నిర్వహించి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ సత్యవతి, నేత్రవైద్య నిపుణులు సాంబశివరావు, హెల్త్ అసిస్టెంట్లు రామకృష్ణ, రవి మోహన్, ఎఎన్ఎంలు శాంతికుమారి, ఎల్‌టి రూపవతి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: పెదవంక ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బాతుపురం సర్పంచ్ బత్తిని సృజన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో సిఎం జగన్మోహన్ రెడ్డి గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా 230 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అక్కుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి జుత్తు చిన్ని, ఇఒపిఆర్‌డి తిరుమలరావు, వైసిపి మండల నాయకులు బత్తిని లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది కృష్ణవేణి, భాస్కరరావు, వీర్రాజు, పాపారావు, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.


సోంపేట : రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సోంపేట: మండలంలో తురక శాసనం, గొల్లగండి గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమెరికాకు చెందిన నెఫ్రాలజిస్ట్ రాధాకృష్ణన్‌తో పాటు వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కిడ్నీ వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్య జాగ్రత్తలపై తెలియజేశారు. కార్యక్రమంలో దిలీప్ కుమార్, సత్యనారాయణ, జయరాం, వెదుళ్ల మాధవరావు పాల్గొన్నారు.

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు


ఆమదాలవలస : కేకును కట్ చేస్తున్న రవికుమార్


శ్రీకాకుళం అర్బన్ : పళ్లు పంపిణీ చేస్తున్న గొండు శంకర్

ప్రజాశక్తి- ఆమదాలవలస

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను మంగళవారం టిడిపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ లోకేష్ అహర్నిశలు బడుగు బలహీనవర్గాల ప్రజల కోసం ఆలోచించే నాయకుడన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నూకరాజు, అన్నెపు భాస్కరరావు, బొడ్డేపల్లి గౌరీపతిరావు, రాడ విజయకుమార్, నాగళ్ళ మురళీధర్ పాల్గొన్నారు.

పోలాకి: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు సందర్భంగా నరసన్నపేట పార్టీ కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముందుగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావు, మాజీ కేంద్రమంత్రి స్వర్గీయ కింజరాపు ఎర్రంనాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసిన నివాళ్లర్పించి అనంతరం ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో పాల్గొని కేకు కట్ చేశారు. ఈ వేడుకల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండల కేంద్రం జెఆర్.పురం టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు కేకు కట్ చేసి లోకేష్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గొర్లె విజయ్ కుమార్, మండల పార్టీ నాయకులు లెంక శ్యామలరావు, పిసిని జగన్నాధం నాయుడు, పిన్నింటి భానోజీ నాయుడు, డిజిఎం ఆనందరావు, ముక్కు ఆదినారాయణ, గురాన రామారావు, ఎం. రమేష్, కనకారావు పాల్గొన్నారు.


పోలాకి : కేకు కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి


రణస్థలం రూరల్ : కేకు కట్ చేస్తున్న రామ్ మల్లిక్ నాయుడు

శ్రీకాకుళం అర్బన్ : నారా లోకేష్ జన్మదిన సందర్భంగా సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ రిమ్స్‌లో చికిత్స పొందుతు 700 మంది రోగులకు, బెహరా మనో వికాస కేంద్రంలో అనాథ పిల్లలకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఏడు రోడు రోడ్ల కూలి వద్ద అన్నదానం, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, ఇప్పిలి తిరుమలరావు, రెడ్డి శంకర్, ముకళ్ల శ్రీను, గొండు వెంకట రమణమూర్తి పాల్గొన్నారు.

పెన్షనర్ల లైఫ్ సర్టిఫికేట్లకు ప్రత్యేక కౌంటర్

ఆమదాలవలస : విశ్రాంత పెన్షనర్ల వయోభారం దృష్ట్యా సబ్‌ట్రెజరీ కార్యాలయం కింది అంతస్తులో లైఫ్ సర్టిఫికెట్లు స్వీకరణ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడమైందని పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు, కోశాధికారి హెచ్‌వి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పెన్షనర్లందరు వినియోగించుకొని ఫిబ్రవరి 29లోగా లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని కోరారు. సబ్ ట్రెజరీ కార్యాలయంలో పెన్షనర్ల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినందుకు సబ్ ట్రెజరీ అధికారి సువర్ణరాజుకు పెన్షనర్ల సంఘం తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.

'మభ్యపెడుతున్న వైసిపి'

శ్రీకాకుళం అర్బన్: టిడిపి ప్రభుత్వ హయాంలో నగరంలోని కెఆర్ స్టేడియం, ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు, గార వద్ద నిర్మించిన వంశధార నదిపై వంతెన నిర్మాణం, నర్సింగ్ కళాశాల, వంశధార నదిలో తాగునీటి అవసరాలకు నిర్మించిన డక్ పనులు మధ్యలోనే ఆపేశారని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. అరసవల్లిలోని వారి స్వగృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులను అసంపూర్తిగా విడిచి పెట్టి నాలుగున్నరేళ్లుగా కాలక్షేపం చేశారని అన్నారు.


మాట్లాడుతున్న 'గుండ' దంపతులు

శిరీషకు సన్మానం


శిరీషను సన్మానిస్తున్న మంత్రి ధర్మాన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతిభకు ఆర్థిక సమస్యలు అడ్డు కారాదని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సౌత్ జోన్ ఉష్ ఈడా పోటీల్లో విజేతగా నిలిచిన ముద్దాడ శిరీషను ఆమె స్వగ్రామం సానివాడలో మంగళవారం ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తున్న ఆమెకు తనవంతు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది క్రీడాకారులు ఉన్నా ప్రోత్సహించి తగిన సూచనలు అందించిన వారి సహకారంతోనే ముందడుగు వేయగలరన్నారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మార్షల్ ఆర్ట్స్ మానసిక, శారీరక దృఢత్వాన్నిస్తాయన్నారు. ఆమెను ప్రోత్సహిస్తున్న కోచ్‌లను తల్లిదండ్రులను మంత్రి అభినందించారు. చదువులతో పాటే ఆటల్లోనూ పిల్లలను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి అంబటి నిర్మల, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, అప్పలసూరి పాల్గొన్నారు.

సంఘ డైరీ అవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తున్న మల్టీపర్పస్ ఆరోగ్య విస్తరనాధికారుల కమ్యూనిటీ హెల్త్ అధికారుల యూనియన్ డైరీని డిఎంహెచ్ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో నిత్యం క్షేత్రస్థాయిలో ఉంటూ ప్రజలకు వ్యాధులపై అప్రమత్తం చేయాలన్నారు. మెరుగైన వైద్య సేవలందిస్తూ ఆరోగ్య సురక్ష, కుటుంబ డాక్టర్ విధానం అమలు వంటి కార్యక్రమాల్లో భాగ స్వాములుగా చురుకైన పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఇప్పిలి నారాయణరావు, సెక్రెటరీ తుమ్మిడి సోమేశ్వరరావు, కోశాధికారి శిమ్మ సోమేశ్వర రావు, కె.వి.నారాయణ రావు, జె.శ్రీనివాసరావు, సిహెచ్.వెంకటరావు పాల్గొన్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి


మాట్లాడుతున్న ప్రసాదరావు

'సామంతుల' అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- కవిటి

సామంతుల విద్య, వైద్య, ఉపాధి కల్పనకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తానని విశ్రాంత డిఎస్‌పి ఎస్‌వివి ప్రసాదరావు తెలిపారు. మండలం తొత్తిడిపుట్టుగలో మంగళవారం జరిగిన మండలంలోని 16 గ్రామాలకు చెందిన సామంత కుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో అన్ని రంగాల్లో ప్రపంచం ముందుకు పరిగెడుతున్నా, సామంతులు ఇంకా వెనుకబడి ఉన్నారన్నారు. వారికి సరైన వసతులు కల్పించి వారిలో చైతన్యం కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. తనవంతుగా వారి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనకు సంబంధించి పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సామంత కుల పెద్దలు శంక సునీల్ కుమార్, గణేష్, నరేన్, లక్ష్మణరావు, లోకనాథం, దినేష్, కృష్ణ, వెంకటేష్, వాసు, భువనాథ్, సుందరరావు, తరణి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కామేశ్వరరావు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి- పలాస

రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా పని చేయాలని టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఒకటో వార్డు మొగిలిపాడులో మంగళవారం పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు స్తబ్ధతంగా ఉన్న కార్యకర్తలు, ఓటర్లు, వైసిపి అసంతృప్తి నాయకులు టిడిపిలో చేరాలంటే రాబోయే ఎన్నికల్లో అందరం కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణ, బడ్డ నాగరాజు, అంబటి కృష్ణమూర్తి, శంకర్, సార దడెలు నరసింహులు, కొండే నరసింహులు, నాబిల్లి శ్రీను, కుమ్మరి శివాజీ పాల్గొన్నారు.


రామకృష్ణారెడ్డితో తులసీవరప్రసాదరావు

సజ్జలను కలిసిన లోతుగెడ్డ

కొత్తూరు : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని మంగళవారం విజయవాడలో వైసిపి జిల్లా కోశాధికారి, పాతపట్నం నియోజకవర్గ నాయకులు లోతుగడ్డ తులసీవరప్రసాదరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ స్థితిగతులను ఆయనకు తెలిపారు.


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

సోంపేట: మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె. జగన్ మోహనరావు అన్నారు. మండలంలో కొర్లాం, నూకలూరు గ్రామాల్లో అభ్యుదయ రైతులు ఢిల్లీరావు, పున్నయ్య పొలాల్లో మంగళవారం పంట పరిశీలన చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం నుంచి సేకరించిన విత్తనాలను వేయడం జరిగిందని, ప్రస్తుతం పంట పరిస్థితిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎఒ నరసింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.